జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
సోమవారం | 18 | మే | 2026 ◆ పేజీలు : 7



# భద్రాద్రిలో వైభవంగా 'గోదావరి నది హారతి'

- అధిక జ్యేష్ఠ మాసం ప్రారంభం పురస్కరించుకొని ప్రత్యేక పూజలు
- భక్తజన సందోహం.. మారుమోగిన రామ నామ స్మరణ



**భద్రాచలం టౌన్, మే 17 ప్రజాజ్యోతి** అధిక జ్యేష్ఠ మాసం శుక్లపక్ష పాడ్యమిని పురస్కరించుకొని భద్రాచలం దివ్యక్షేత్రంలోని గోదావరి తీరం భక్తి ప్రపత్తులతో పులకించిపోయింది. ఆదివారం రాత్రి గోదావరి కరకట్ట వద్ద పురోహితుల మంత్రోచ్చారణల నడుమ నదీ హారతి కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తుల జయజయధ్వానాలు, వేద పండితుల ఆశీర్వచనాలతో గోదావరి తీరం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఈ సందర్భంగా ప్రముఖ పురోహితులు రామవజ్జల రవికుమార్ శర్మ మాట్లాడుతూ..

మిగతా 2 లో...




- చెమట చిందించిన రైతుకు చాటునైనా చోటు లేదు
- రైతు బజార్ లేక గిరిజన రైతుల అవస్థలు
- రోడ్డుపైనే పంట అమ్ముకుంటున్న ఏజెన్సీ రైతులు
- గిట్టుబాటు లేక సాగుకు దూరమవుతున్న గిరిజనులు
- మధ్యవర్తుల చేతుల్లోనే రైతుల భవిష్యత్తు
- భద్రాచలంలో రైతు బజార్ కోసం పెరుగుతున్న డిమాండ్

6 లో..

# అడవిలో పండిన పంటకు... అమ్ముకునే చోటేదీ..?

రైతులు తాము పండించిన పంటను నేరుగా ప్రజలకు విక్రయించుకునే అవకాశాన్ని కల్పించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో రైతు బజార్లు ఏర్పాటు చేశారు. దీంతో రైతులకు గిట్టుబాటు ధర లభించడంతో పాటు ప్రజలకు కూడా తాజా కూరగాయలు, పండ్లు అందుబాటులోకి వస్తున్నాయి. అయితే ఏజెన్సీ ప్రాంతానికి కేంద్రంగా ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో మాత్రం పరిస్థితి పూర్తిగా భిన్నంగా కనిపిస్తోంది. వందలాది మంది గిరిజన రైతులు తాము కష్టపడి పండించిన కూరగాయలు, పండ్లు, అడవిలో సేకరించిన అటవీ ఉత్పత్తులను అమ్ముకునేందుకు సరైన వేదిక లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో భద్రాద్రి ఏజెన్సీలో నెలకొన్న పరిస్థితులపై ప్రజాజ్యోతి అందిస్తున్న ప్రత్యేక కథనం.


● భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి (భూక్యా రంజిత్ నాయక్), ప్రజాజ్యోతి



# పట్టపగలే వెలుగుతున్న లైట్లు

- పట్టించుకునే వారెవ్వరు!
- విద్యుత్ ను ఆదా చేయడంలో విఫలమా
- అధికారులు మరల పునరావృతం కాకుండా చూడరు

**ఇల్లందు, మే 17, ప్రజాజ్యోతి:** ఇల్లందు మున్సిపల్ పరిధిలో సమయపాలన లేకుండా వీధిలైట్లు వెలుగుతున్నాయి. ప్రధానంగా 23వ వార్డులో నిత్యం జనం సంచరించే ప్రవేశంలో మున్సిపల్ అధికారులు ఏర్పాటు చేసిన లైట్లు పగలు.. రాత్రి అనే తేడా లేకుండా వెలుగుతూ ఉండడం విశేషం. సాధారణంగా ఆయా లైట్లను ప్రతిరోజు సాయంత్రం 6 తరువాత వెలగడం మనం చూస్తూనే ఉంటాం. కానీ 23వ వార్డులో లైట్లు మాత్రం 24 గంటలు వెలుగుతూనే ఉన్నాయి. విద్యుత్ ను ఆదా చేసి చార్జీల భారాన్ని తగ్గించాల్సింది పోయి ఇలా నిత్యం లైట్లు వెలగడం పట్ల ఆ ప్రాంత ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తెల్లవారినప్పటికీ లైట్లను బంద్ చేయకపోవడం ఏమిటని మున్సిపల్ అధికారులను ప్రశ్నిస్తున్నారు. ముఖ్యంగా వేసవికాలంలో విద్యుత్ ను ఆదా చేయాల్సింది పోయి దుర్వినియోగం చేయటం సరికాదని, మరల ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని మున్సిపల్ అధికారులను ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.



- కూరగాయలు, నూనెలు, కిరాణా సరుకుల రేట్లకు రెక్కలు
- ధరల దెబ్బతో కుదేలవుతున్న మధ్యతరగతి
- బంగారం, చిట్టీలు, సేవింగ్స్‌కు దూరమవుతున్న కుటుంబాలు
- ఆటో డ్రైవర్లు, చిన్న వ్యాపారులపై తీవ్ర ప్రభావం
- ఆదాయం అదే.. ఖర్చులు మాత్రం అమాంతం పెరుగుదల
- ఇంధన భారంతో ఇల్లు గడవడం కష్టమే

2 లో..

# మంటల్లో.... మానవ జీవితం




అమాంతం పెరుగుతున్న ఇంధన ధరలు, నిత్యావసర వస్తువుల రేట్లు సామాన్యుడి జీవనాన్ని ఆర్థిక సంక్షోభం వైపు నెడుతున్నాయి. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల భారం రవాణా రంగంపై తీవ్ర ప్రభావం చూపుతుండగా.. మరోవైపు కూరగాయలు, వంట నూనెలు, కిరాణా సరుకులు, ఎఫ్ఎంసీజీ ఉత్పత్తుల ధరలు ప్రజల జేబులకు చుక్కలు చూపిస్తున్నాయి. ఒకప్పుడు నెల జీతంతో సాఫీగా గడిచిన కుటుంబ జీవితం ఇప్పుడు రోజువారీ ఖర్చులకే తడబడుతోంది. పెరుగుతున్న ద్రవ్యోల్బణంతో పొదుపు అనే మాట క్రమంగా కనుమరుగవుతుండగా.. సామాన్యుడి బతుకు భారంగా మారుతోంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులపై ప్రజాజ్యోతి ప్రత్యేక కథనం.

● భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి


- కూరగాయలు, నూనెలు, కిరాణా సరుకుల రేట్లకు రెక్కలు
- ధరల దెబ్బతో కుదేలవుతున్న మధ్యతరగతి
- బంగారం, చిట్టీలు, సేవింగ్స్‌కు దూరమవుతున్న కుటుంబాలు
- ఆటో డ్రైవర్లు, చిన్న వ్యాపారులపై తీవ్ర ప్రభావం
- ఆదాయం అదే.. ఖర్చులు మాత్రం అమాంతం పెరుగుదల
- ఇంధన భారంతో ఇల్లు గడవడం కష్టమే

# మంటల్లో... మానవ జీవితం






**అమాంతం పెరుగుతున్న ఇంధన ధరలు, నిత్యావసర వస్తువుల రేట్లు సామాన్యుడి జీవనాన్ని ఆర్థిక సంక్షోభం వైపు నెడుతున్నాయి. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల భారం రవాణా రంగంపై తీవ్ర ప్రభావం చూపుతుండగా.. మరోవైపు కూరగాయలు, వంట నూనెలు, కిరాణా సరుకులు, ఎఫ్‌ఎంసీజీ ఉత్పత్తుల ధరలు ప్రజల జేబులకు చుక్కలు చూపిస్తున్నాయి. ఒకప్పుడు నెల జీతంతో సాఫీగా గడిచిన కుటుంబ జీవితం ఇప్పుడు రోజువారీ ఖర్చులకే తడబడుతోంది. పెరుగుతున్న ద్రవ్యోల్బణంతో పొదుపు అనే మాట క్రమంగా కనుమరుగవుతుండగా.. సామాన్యుడి బతుకు భారంగా మారుతోంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులపై ప్రజాజ్యోతి ప్రత్యేక కథనం.**



● భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి

ఇంధన ధరల పెరుగుదలతో మొదలైన భారాలు ఇప్పుడు ప్రతి ఇంటి బడ్జెట్‌ను కుదిపేస్తున్నాయి. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు రోజురోజుకీ పెరుగుతుండగా..మార్కెట్‌లో నిత్యావసర వస్తువుల ధరలు కూడా అదే స్థాయిలో పరుగులు తీస్తున్నాయి. దీంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా మధ్యతరగతి, దిగువ ఆదాయ వర్గాల కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. కొత్తగూడెం, పాల్వంచ, మణుగూరు, భద్రాచలం, ఇల్లందు, అశ్వారావుపేట వంటి పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కూడా ధరల పెరుగుదల ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ఒకప్పుడు నెల జీతంతో ఇల్లు నెట్టుకొచ్చిన కుటుంబాలు ఇప్పుడు పదిరోజులు గడవకముందే చేతులు ఎత్తేస్తున్న పరిస్థితి నెలకొంది.

### రవాణా భారం..

పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడంతో రవాణా ఛార్జీలు భారీగా పెరిగాయి. రైతు బజార్ల నుంచి పట్టణ మార్కెట్ల వరకు కూరగాయలు, పండ్లు, ధాన్యాల రవాణా ఖర్చులు పెరగడం వల్ల ఆ ప్రభావం నేరుగా వినియోగదారులపై పడుతోంది. కూరగాయల వ్యాపారుల మాటల్లో చెప్పాలంటే.. గతంతో పోలిస్తే ట్రాన్స్‌పోర్ట్ ఖర్చులు గణనీయంగా పెరిగాయి. దీంతో సరుకుల ధరలు పెంచక తప్పని పరిస్థితి ఏర్పడిందని చెబుతున్నారు. ఫలితంగా సాధారణ ప్రజలు రోజువారీ కొనుగోళ్లకే అధిక మొత్తంలో డబ్బులు వెచ్చించాల్సి వస్తోంది.

### ధరల దెబ్బకు బడ్జెట్ బోర్లా

వంట నూనెలు, పప్పులు, బియ్యం, సబ్బులు, షాంపూలు, ఇతర కిరాణా సరుకుల ధరలు నెలనెలకూ పెరుగుతూనే ఉన్నాయి. ముఖ్యంగా ఎఫ్‌ఎంసీజీ ఉత్పత్తుల ధరల పెరుగుదల వినియోగదారులపై మరింత భారం మోపుతోంది. ముడిసరుకుల ధరలు పెరిగాయని చెబుతూ కంపెనీలు వరుసగా రేట్లు పెంచుతుండడంతో కుటుంబ బడ్జెట్‌లు పూర్తిగా తారుమారవుతున్నాయి. ఒకప్పుడు నెలకు సరిపడే సరుకులు కొనేందుకు అయ్యే ఖర్చు ఇప్పుడు రెండు వారాలకు కూడా సరిపోని పరిస్థితి నెలకొంది. దీంతో చాలామంది కుటుంబాలు అవసరాలను తగ్గించుకుంటూ జీవనం సాగిస్తున్నాయి.

### జీతం వస్తోంది.. నిలవడం లేదు

ఇంటి అద్దెలు, పిల్లల చదువులు, విద్యుత్ బిల్లులు, వైద్య ఖర్చులు, రవాణా వ్యయాలు ఒకవైపు పెరుగుతుండగా.. మరోవైపు నిత్యావసర వస్తువుల ధరలు కూడా భారంగా మారుతున్నాయి. దీంతో మధ్యతరగతి కుటుంబాల జీవితం అస్తవ్యస్తంగా మారుతోంది. ప్రైవేట్ ఉద్యోగులు, చిన్న వ్యాపారులు, రోజువారీ కూలీలు, ఆటో డ్రైవర్లు వంటి వర్గాలు పెరుగుతున్న ధరలతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నాయి. సంపాదన పెరగకపోయినా ఖర్చులు మాత్రం రోజురోజుకీ రెట్టింపవుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### మాయమైన పొదుపు మాట

ధరల పెరుగుదల కారణంగా చాలా మంది కుటుంబాలు పొదుపులను పూర్తిగా తగ్గించుకున్నాయి. ఒకప్పుడు బంగారం కొనుగోలు, చిన్న చిన్న సేవింగ్స్, చిట్టీలు వేసే కుటుంబాలు ఇప్పుడు కేవలం నెలవారీ ఖర్చులు నిర్వహించడానికే పరిమితమవుతున్నాయి. కొంతమంది ఉద్యోగులు అయితే జీతం వచ్చిన వారం రోజులకే ఖాతాలో డబ్బులు ఖాళీ అవుతున్నాయని చెబుతున్నారు. పిల్లల భవిష్యత్తు కోసం దాచుకునే పరిస్థితి కూడా లేకుండా పోతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### ధరలకు అడ్డుకట్ట ఎప్పుడో..?

పెరుగుతున్న ధరలతో సామాన్యుడు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఇంధన ధరలు, నిత్యావసర వస్తువుల రేట్ల నియంత్రణపై ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. ధరలకు అడ్డుకట్ట పడకపోతే రానున్న రోజుల్లో మధ్యతరగతి, దిగువ వర్గాల జీవితం మరింత సంక్షోభంలోకి జారిపోతుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.



"ఒకప్పుడు ₹500తో వారం రోజుల సరుకులు వచ్చేవి. ఇప్పుడు రెండు రోజులకే సరిపోవడం లేదు. ఏది కొనాలన్నా ధరలు చుక్కలు చూపిస్తున్నాయి."

– సీతామహాలక్ష్మి, గృహిణి




"డీజిల్, పెట్రోల్ ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ఆదాయం పెరగడం లేదు. సంపాదించిన దాంట్లో ఎక్కువ భాగం ఇంధనానికే వెళ్తోంది."

– రాము, ఆటో డ్రైవర్

"కంపెనీలు తరచూ రేట్లు పెంచుతున్నాయి. కస్టమర్లు మాత్రం మమ్మల్నే ప్రశ్నిస్తున్నారు. వ్యాపారం చేయడం కూడా భారంగా మారింది."

– జయంత్, కిరాణా వ్యాపారి



"పిల్లల ఫీజులు, ఇంటి ఖర్చులు, కిరాణా బిల్లులు చూసుకుంటే నెలాఖరుకు చేతిలో ఏమీ మిగలడం లేదు. పొదుపు అనే మాట మర్చిపోయాం.

– లింబా, తాత్కాలిక ఉద్యోగి



## భద్రాద్రిలో వైభవంగా 'గోదావరి నది హారతి'

(మొదటి పేజీ తరువాయి...)

శ్రీ సీతారామచంద్రస్వామి కొలువై ఉన్న పుణ్యక్షేత్రంలో, అది కూడా అధిక జ్యేష్ఠ మాసం ఆదివారంతో ప్రారంభం కావడం అత్యంత విశేషమన్నారు. లోకకల్యాణార్థం ఈ అధిక మాసంలో చేసే సత్కార్యాలు, నదీ స్నానాలు, హారతి దర్శనం వల్ల ప్రజలకు ఆయురారోగ్య ఐశ్వర్యాలు సిద్ధిస్తాయని తెలిపారు. దేశ విదేశాల నుంచి తరలివచ్చిన భక్తులు ఈ దివ్య మంగళ హారతిని దర్శించుకుని పునీతులయ్యారని పేర్కొన్నారు.

### 108 ప్రమిదలతో దీపోత్సవం..

హారతి కార్యక్రమానికి ముందుగా పురోహితులు నదీ హారతి విశేషాలను భక్తులకు వివరించారు. అనంతరం శాస్త్రోక్తంగా గణపతి పూజ నిర్వహించి, 'జైశ్రీరామ్' ఆకృతిలో 108 ప్రమిదలతో ఏర్పాటు చేసిన దీపోత్సవం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. వివిధ పూజా ద్రవ్యాలతో గోదావరి మాతకు అష్టోత్తర శతనామార్చన చేశారు. పురోహితులు శ్రీరామ అష్టోత్తరాన్ని పఠిస్తుండగా భక్తులంతా ఏకధాటిగా 108 సార్లు 'ఓం శ్రీ రామాయ నమః' అంటూ చేసిన రామనామ భజనతో కరకట్ట పరిసరాలు ప్రతిధ్వనించాయి.

### నయనానందకరంగా హారతుల సమర్పణ

మొదటగా శ్రీ సీతారామచంద్రస్వామి వారికి 12 సార్లు ప్రత్యేక హారతులు ఇచ్చిన అనంతరం, గోదావరి మాతకు 21 సార్లు వివిధ రకాల హారతులను సమర్పించారు. లోక కల్యాణం కోసం ప్రతి ఆదివారం నిర్వహించే ఈ మహత్కార్యంలో భక్తులు, స్థానిక గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి, గోదావరి మాత కృపకు పాత్రులు కావాలని పురోహితులు కోరారు.

కార్యక్రమం ముగింపులో శాంతిమంత్ర పఠనం చేశారు. రవికుమార్ శర్మ, లక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో భక్తులకు పులిహోర, శనగలను ప్రసాదంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి భద్రాచలానికి చెందిన శ్రీ రాఘవేంద్ర బట్టల దుకాణం వారు పూజా సామాగ్రిని సమకూర్చారు. ఈ వేడుకలో పురోహితులు సత్య ప్రసాద్ శర్మ, కృష్ణమాచార్య, కదంబరి కృష్ణ శర్మ, రామాచార్యులు, కంజర్ల సుబ్రహ్మణ్యం, తేజ శర్మ, వీరభద్ర శర్మలతో పాటు వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, 'భద్రాద్రి కా మహారాజు' కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## గుబ్బల మంగమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

**అశ్వారావుపేట, మే 16 (ప్రజాజ్యోతి):** మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన గుబ్బల మంగమ్మ తల్లి ఆలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. మారుమూల అటవీప్రాంతంలోని ఈ మహిమాన్విత క్షేత్రానికి భక్తులు భారీ సంఖ్యలో పోటెత్తారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి కూడా వేలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. తెల్లవారుజాము నుంచే ఆలయానికి చేరుకున్న భక్తులు అర్చనలు నిర్వహించారు. గుబ్బలమంగమ్మ తల్లికి సాంప్రదాయబద్ధంగా పూజలు చేసి, మొక్కుబడులు చెల్లించుకున్నారు. మరికొందరు భక్తులు ఆలయ పరిసరాల్లోనే వంటలు వండుకుని, అమ్మవారికి నైవేద్యం సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తుల రాక ఒక్కసారిగా పెరగడంతో ఆలయ పరిసర ప్రాంతాలు, వాహనాల పార్కింగ్ స్థలాలు వాహనాలతో నిండిపోయాయి. అడవి మధ్యలో కొలువైన గుబ్బల మంగమ్మ తల్లిని దర్శించుకోవడం వల్ల కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల నమ్మకం. ఈ క్రమంలోనే భక్తుల కోలాహలంతో అటవీ ప్రాంతం ఆధ్యాత్మిక శోభతో వికసించింది.





# ఇంధన ధరల మోతపై సీపీఎం ఆగ్రహం

- ప్రజలకు పొదుపు మంత్రం.. మోడీకి విదేశీ మోజా..?
- పెట్రోల్, డీజిల్ భారంతో సామాన్యులే బలి



**కొత్తగూడెం, మే 17 ( ప్రజాజ్యోతి )** పెట్రోల్, డీజిల్ ధరల పెంపును నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆటోకు తాడు కట్టి లాగుతూ వినూత్నంగా ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్వదేశీ నినాదాలు చెబుతూనే విదేశీ వస్తువులపై మక్కువ చూపుతున్నారని విమర్శించారు. తాను వేసుకునే కోటు, తాగే నీళ్లు, చేతికి పెట్టుకునే వాచ్ విదేశీ ఉత్పత్తులేనని ప్రజలకు మాత్రం పొదుపు మంత్రం చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. పొదుపు సూత్రాలు సామాన్య ప్రజలకేనా..? ప్రధానమంత్రికి వర్తించవా..? అని ప్రశ్నించారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల పెంపుతో సామాన్యులపై తీవ్ర భారం పడుతోందన్నారు. గ్యాస్ ధరల పెంపుతో ఇప్పటికే అనేక పరిశ్రమలు మూతపడగా కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధరల పెంపు దేశ ఆర్థిక వ్యవస్థపైనా తీవ్ర ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. ఇరాన్, అమెరికా, ఇజ్రాయిల్ మధ్య యుద్ధ పరిస్థితులను చూపుతూ కేంద్రం పొదుపు చర్యలు చేపట్టాలని చెప్పడం సరికాదన్నారు. యుద్ధాన్ని ఆపేందుకు చర్యలు తీసుకోవాల్సింది పోయి ప్రజలపై భారాలు మోపడం దారుణమన్నారు. అమెరికాకు అనుకూలంగా వ్యవహరిస్తూ ట్రంప్‌కు సాష్టాంగ నమస్కారాలు చేస్తున్న మోడీ ప్రభుత్వం ప్రజలకు మాత్రం త్యాగాల ఉపన్యాసాలు ఇస్తోందని విమర్శించారు. యూరియా వాడొద్దు, విదేశీ ప్రయాణాలు ఆపండి, బంగారం కొనొద్దు, వర్క్ ఫ్రమ్ హోం చేయండి అనే సూచనలు దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తాయని అన్నారు. ఉత్పత్తి వ్యవస్థ దెబ్బతిన్న తర్వాత దేశ అభివృద్ధి ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. అమెరికాకు మద్దతు ఇవ్వడం వల్లే ఇరాన్ నుంచి హార్మోస్ జలసంధి ద్వారా రావాల్సిన పెట్రోల్, డీజిల్ రవాణా ప్రభావితమైందని ఆరోపించారు. విశ్వగురు అని చెప్పుకునే మోడీ యుద్ధాన్ని ఆపి అమెరికాపై ఒత్తిడి తీసుకురాలేరా..? అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అన్నవరపు సత్యనారాయణ, లిక్కి బాలరాజు, రేపాకుల శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు భూక్య రమేష్, నాయకులు నందిపాటి రమేష్, నాగకృష్ణ, సతీష్, బాలకృష్ణ, రాములు, సలీం, శ్రీను పాల్గొన్నారు.

## భద్రాద్రి రామయ్యకు అభిషేకం, స్వర్ణ పుష్పార్చన



**భద్రాచలం టౌన్ , మే 17 ప్రజాజ్యోతి** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి ఆదివారం సందర్భంగా అంతరాలయంలో ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అలాగే స్వర్ణ పుష్పారన భక్తుల సమక్షంలో జరిగింది. అదేవిధంగా నిత్యకల్యాణ మండపంలో స్వామి వారి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేనార్చన, పుణ్యహావచనం, కంకణదారణ, జీలకరబెల్లం, మాంగల్యదారణ, తలంబ్రాలు, వేద ఆశీర్వచనం నిర్వహించారు.

## ప్రతిభకు ప్రోత్సాహం.. విద్యార్థులకు సన్మానం



**చర్ల, మే 17 :(ప్రజా జ్యోతి ):** ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా విద్యా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల జీహెచ్ఎస్ చర్లలో ఆదివారం ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఘనంగా సత్కరించారు. వారోత్సవాల 7వ రోజు కార్యక్రమంలో భాగంగా పాఠశాలలు, కళాశాలల్లో అత్యున్నత మార్కులు సాధించి ప్రతిభ చాటిన విద్యార్థులను ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల చర్లకు చెందిన ఎం. శ్రావ్య 485 మార్కులు, పి. ప్రదీప్ 480 మార్కులు, ఎస్. మల్లిక 473 మార్కులు సాధించి పాఠశాలకు మంచి గుర్తింపు తీసుకువచ్చినందుకు వారి తల్లిదండ్రుల సమక్షంలో ఘనంగా సన్మానించారు. విద్యార్థులకు శాలువాలు, పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థుల కృషి, పట్టుదల, క్రమశిక్షణ వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని కొనియాడారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఓ రమణ మాట్లాడుతూ విద్యార్థులు సాధించిన ఫలితాలు ఇతరులకు ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు కూడా సరైన మార్గదర్శకత్వం, కష్టపడి చదివే తత్వం ఉంటే ఉన్నత ఫలితాలు సాధించగలరని పేర్కొన్నారు. రాబోయే విద్యా సంవత్సరంలో కూడా ఇదే ఉత్సాహంతో చదివి మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. హరిప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయ బృందం కృషి చేస్తోందని తెలిపారు. విద్యార్థులు సాధించిన విజయాలకు తల్లిదండ్రుల సహకారం కూడా ఎంతో కీలకమని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని ప్రతిభావంతులైన విద్యార్థులను అభినందించారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ముగిసిన విద్యా వారోత్సవాలు




**భద్రాచలం టౌన్, మే 17, ప్రజాజ్యోతి** భద్రాచలంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో ఈ నెల 11 నుంచి నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాలు ఆదివారంతో ముగిసాయి. చివరి రోజున కళాశాల అభివృద్ధికి ఆర్థిక చేయూతనందిస్తున్న సీఎస్ఆర్ డోనర్స్, ఇతర దాతలను ఘనంగా కళాశాల ప్రిన్సిపాల్ జాన్‌మిల్టన్ సన్మానించారు. ఈ సందర్భంగా సీపీడీసీ సభ్యులు జి. శంకర్‌రావు కళాశాలలో పూల కుండీలు, మొక్కలు అందించారు. అలాగే ఐటీసీ హెచ్ఆర్ మేనేజరు బి.విశ్వనాథ్ విద్యాభివృద్ధికి కావాల్సిన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. కళాశాలలో చదివే విద్యార్థులకు ఉద్యోగాలు సంపాదించిన వారిని అభినందించి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక అధ్యాపకేత్ర బృందం మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ఈనెల 20న మెడికల్ షాపులు బంద్

**ఇల్లందు, మే 17, ప్రజాజ్యోతి:** ఆన్లైన్ మందుల విక్రయాలను నిలిపివేయాలని, జీఎస్ఆర్ 817 నువ్వు సవరించాలని కోరుతూ ఈనెల 20న ఆల్ ఇండియా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ పిలుపుమేరకు మెడికల్ షాపులను బంద్ చేనున్నట్లు ఇల్లందు కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పసుమర్తి లక్ష్మణ్ రావు, గంధం వెంకటేశ్వర్లు లు తెలిపారు. ఆదివారం స్థానిక కళాసి బస్తీలో గల ఆర్యవైశ్య సత్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ చిన్న మందుల షాపుల కోసం కార్పొరేట్లు ఇచ్చే భారీ డిస్కౌంట్లను అరికట్టాలని కోరారు. నకిలీ మందులను నివారించాలని, నాణ్యతలేని నకిలీ మందుల వ్యాప్తిని అందుకోవడానికి జిఎస్ఆర్ 220ను ఉపసంహరించుకోవాలన్నారు. మెడికల్ షాపుల బంద్ వల్ల రోగులకు ఇబ్బందులు కలగవద్దని, ముందస్తుగా మందులను కొనుగోలు చేసుకోవాలని సూచించారు. మెడికల్ షాపుల బంద్ కు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో కోశాధికారి జహీర్ అహ్మద్, మెడికల్ షాపుల యజమానులు తేలుకుంట్ల రజినీకాంత్, కొత్తూరి రామారావు, ధారావత్ వీరన్న తదితరులు పాల్గొన్నారు.



## సింగరేణి వాస్తవ లాభాలు వెంటనే ప్రకటించాలి

- జెన్కో బకాయిలు వసూలు చేసి కొత్త ప్రాజెక్టులు తీసుకురావాలి
- కార్మికులపై ఉత్పత్తి ఒత్తిడి ఆపాలని ఎఐటీయూసీ డిమాండ్




**కొత్తగూడెం, మే 17 ( ప్రజాజ్యోతి )** సింగరేణి సంస్థ గత ఆర్థిక సంవత్సరంలో పొందిన వాస్తవ లాభాలను యాజమాన్యం వెంటనే ప్రకటించాలని సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎఐటీయూసీ అదనపు ప్రధాన కార్యదర్శి మిరియాల రంగయ్య డిమాండ్ చేశారు. జెన్కో నుంచి రావాల్సిన రూ.53 వేల కోట్ల బకాయిలను వెంటనే వసూలు చేసి సంస్థకు కొత్త ప్రాజెక్టులు తీసుకువచ్చి సింగరేణి మనుగడను కాపాడాలని కోరారు. ఆదివారం కొత్తగూడెంలోని శేషగిరిభవన్‌లో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల డైరెక్టర్ (పా)తో జరిగిన చర్చల వివరాలను నాయకులకు వివరించారు. సింగరేణి గనుల్లో ఉత్పత్తి లక్ష్యాల పేరుతో కార్మికులపై అధిక ఒత్తిడి తెస్తూ జారీ చేస్తున్న జీఓలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కనీస సౌకర్యాలు, ఆధునిక యంత్రాలు లేకుండా ఉత్పత్తి పెంచాలని ఒత్తిడి చేయడం సరికాదన్నారు. మల్టీ డిసిప్లినరీ కమిటీలు సరైన విధానం కాదని అభిప్రాయపడ్డారు. గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన లాభాల వాటా ప్రకటించకుండా యాజమాన్యం కార్మికులను మభ్యపెడుతోందని విమర్శించారు. మెడికల్ బోర్డుకు సంబంధించి యాజమాన్యం చర్చల్లో ఒప్పుకున్న విధంగానే పాత పద్ధతిలోనే మెడికల్ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. పాత గనులు మూతపడుతున్న నేపథ్యంలో ఓబీలను సింగరేణి టేకోవర్ చేసుకొని సంస్థను బలోపేతం చేయాలని సూచించారు. ఇతర రాష్ట్రాల్లో చేపడుతున్న సింగరేణి ప్రాజెక్టులపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన లేబర్ కోడ్‌లను సింగరేణిలో అమలు చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. మల్టీ డిపార్ట్‌మెంట్ మీటింగ్‌ల పేరుతో పని గంటలు పెంచి కార్మికులపై అదనపు భారం మోపడం కంటే ముందుగా మన్‌పవర్ పెంచి, పాత యంత్రాల స్థానంలో కొత్త యంత్రాలను ఏర్పాటు చేయాలని అన్నారు. ఐఎన్టీయూసీ నాయకులు కాంగ్రెస్ మంత్రులతో ఫోటోలకు పోజులిస్తూ కార్మికులను మభ్యపెడుతున్నారని ఆరోపించారు. అధికార పార్టీలో ఉన్నవారు ముందుగా సింగరేణికి జెన్కో నుంచి రావాల్సిన రూ.53 వేల కోట్ల బకాయిలు వసూలు చేయాలని సవాల్ విసిరారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎఐటీయూసీ నిరంతరం పోరాటం చేస్తుందని, యాజమాన్యంపై ఒత్తిడి తీసుకువచ్చి సమస్యలు పరిష్కరించే దిశగా ముందుకు సాగుతుందని చెప్పారు. ఎఐటీయూసీ కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్, కేంద్ర ప్రచార కార్యదర్శి వీరస్వామి, బ్రాంచ్ కార్యదర్శి రమణమూర్తి, వైస్ ప్రెసిడెంట్ క్రిస్టోఫర్, పిట్ కార్యదర్శులు మధు కృష్ణ, కమల్, సీనియర్ నాయకులు లక్ష్మీనారాయణ, సోమయ్య పాల్గొన్నారు.

## హెచ్ఐవీ/ఏయిడ్స్‌పై అవగాహన కల్పిద్దాం

- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**కొత్తగూడెం, మే 17 ( ప్రజాజ్యోతి )** హెచ్ఐవీ / ఏయిడ్స్‌పై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు మే నెలలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది తెలిపారు. ఈ సందర్భంగా కొత్తగూడెం రైల్వే స్టేషన్ పరిధిలో క్యాండిల్స్ వెలిగించి హెచ్ఐవీ / ఏయిడ్స్ బారినపడి మృతిచెందిన వారికి నివాళులర్పిస్తూ రెండు నిమిషాల మౌనం పాటించారు. హెచ్ఐవీ వ్యాధి పట్ల ప్రజలు భయపడకుండా అప్రమత్తంగా ఉండాలని, ముందస్తు పరీక్షలు చేయించుకోవడం ద్వారా వ్యాధిని నియంత్రించవచ్చని వారు సూచించారు. రక్షిత జీవన విధానం, రక్త పరీక్షలు, అవగాహనతోనే హెచ్ఐవీ వ్యాప్తిని అరికట్టవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీటీసీ కౌన్సిలర్ శ్రీనివాసరావు, ప్రాజెక్ట్ మేనేజర్ సెక్రు రాజేంద్రప్రసాద్, ఎం అండ్ ఈ సిరి, లింక్ వర్కర్ దేవి, రామ తదితరులు పాల్గొన్నారు.



## గిరిజన దర్బార్‌కు అధికారులు సకాలంలో హాజరు కావాలి



**భద్రాచలం టౌన్, మే 17, ప్రజా జ్యోతి** భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో నేడు జరిగే గిరిజన దర్బార్‌కు అధికారులు సకాలంలో హాజరు కావాలని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ ఆదేశించారు. గిరిజనులు వారి వారి సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వకంగా ఫిర్యాదును అందజేయాలని తెలిపారు.

## ప్రజా పాలనలో భాగంగా నేడు 2కే రన్

**చర్ల, మే 17(ప్రజా జ్యోతి):** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక – 99 రోజుల కార్యక్రమంలో భాగంగా చర్ల మండల కేంద్రంలో సోమవారం ఉదయం 2కే రన్ నిర్వహించనున్నట్లు మండల అధికారులు తెలిపారు. యువతలో ఆరోగ్య చైతన్యం, సామాజిక బాధ్యతాభావం పెంపొందించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు పేర్కొన్నారు.పోలీస్ శాఖ, పంచాయతీరాజ్ శాఖ, రెవెన్యూ శాఖ , విద్యాశాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఉదయం 6.30 గంటలకు చర్ల అంబేద్కర్ సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు 2కే రన్ నిర్వహించబడుతుందని తెలిపారు. మండలంలోని యువత పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులు కోరారు.ఈ మేరకు మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో), సర్కిల్ ఇన్స్పెక్టర్ (సీఐ), తహసీల్దార్ , మండల విద్యాశాఖ అధికారి సంయుక్తంగా ప్రకటన విడుదల చేశారు.

## మడకం హిడ్మాను ఆదుకోవాలి

- సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ




**చర్ల, మే 17(ప్రజా జ్యోతి ):** చర్ల మండలం బక్క చింతలపాడు గ్రామానికి చెందిన మడకం హిడ్మాను ప్రభుత్వం, దాతలు మానవత్వంతో ఆదుకోవాలని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ భద్రాచలం డివిజన్ కార్యదర్శి ముసలి సతీష్ కోరారు.గత ఆరు సంవత్సరాల క్రితం విద్యుత్ షాక్ ప్రమాదంలో మడకం హిడ్మా రెండు కాళ్లు పూర్తిగా కోల్పోవడంతో పాటు ఎడమ చేయి కూడా పనిచేయకుండా పోయిందని తెలిపారు. అప్పటి నుంచి ఆయన కుటుంబం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందన్నారు. కుటుంబ పోషణ మొత్తం భార్య మడకం సుశీలపై పడిందని, ఆమె కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తోందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ముసలి సతీష్ మాట్లాడుతూ ప్రమాదానికి గురైన మడకం హిడ్మాకు చట్ట ప్రకారం ప్రభుత్వం నష్టపరిహారం అందించాల్సి ఉన్నప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి సహాయం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై పలుమార్లు చర్ల ఎంపీడీవో సహా అధికారులకు వినతులు అందజేసినా స్పందన లేకపోయిందన్నారు.పూర్తిగా వికలాంగుడైన మడకం హిడ్మా కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే ఆర్థిక సహాయం అందించాలని, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని, మూడు చక్రాల స్కూటీ వాహనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే దాతలు ముందుకు వచ్చి మడకం హిడ్మాకు కృత్రిమ కాళ్లు అమర్చేందుకు సహకరించాలని, కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలవాలని కోరారు.మానవత్వంతో స్పందించి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు విజ్ఞప్తి చేశారు.

## ఆదమరిస్తే ప్రమాదమే

- మిషన్ భగీరథ వాల్ ఛాంబర్ లతో జనం ఇబ్బందులు
- రోడ్డుకు అడ్డుగా ఉన్న వాల్ ఛాంబర్లు
- పలువురికి ప్రమాదాలు
- ఫోన్ చేసిన స్పందించని వైనం
- వాల్ ఛాంబర్ లను సరిచేయాలంటున్న జనం

**ఇల్లందు, మే 17, ప్రజాజ్యోతి:** ఇల్లందు మున్సిపల్ పరిధిలోని 9, 10 వార్డులలో మిషన్ భగీరథ కు చెందిన వాల్ ఛాంబర్ లతో జనం అనేక ఇబ్బందులు పడుతున్నారు. నృత్యం వందల సంఖ్యలో జనం సంచరించే రోడ్డు వెంబడి వాల్ ఛాంబర్ లు ఉండడంతో ఆదమరిస్తే ప్రమాదం జరిగే అవకాశం లేకపోలేదు. ఆ మిషన్ భగీరథ వాల్ చాంబర్లు రోడ్డు కంటే ఎక్కువ ఎత్తులో ఉండడం వాటి పైన సిమెంట్ బిళ్ళలు ఉన్నప్పటికి వాటిని సక్రమంగా సరి చేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. గతంలో మిషన్ భగీరథ వాల్ చాంబర్ల వల్ల చాలామందికి రోడ్డు ప్రమాదాలు జరిగి గాయాలైన ఘటనలు ఉన్నాయి. ఈ విషయంపై సంబంధిత మిషన్ భగీరథ అధికారులకు నరుల తరబడి ఫోన్లు చేసి వాల్ ఛాంబర్ ల సమస్యను పరిష్కరించాలని కోరినప్పటికీ ఎలాంటి స్పందన లేకపోవడం విచారకరం.





ప్రధానంగా రాత్రి వేళల్లో ఈ మిషన్ భగీరథ వాల్ చాంబర్ల వల్ల భారీ ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి రోడ్డుకు ఎక్కువ ఎత్తులో ఉన్న మిషన్ భగీరథ వాల్ చాంబర్లను సరిచేయాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుచున్నారు. అధికారులు ఆ దిశగా మిషన్ భగీరథ వాల్ ఛాంబర్ లను సరిచేస్తారో లేదో వేచి చూడాల్సిందే.

## 108 అంబులెన్సు కోసం సబ్ కలెక్టర్‌కు వినతి



**చర్ల, మే 17 :(ప్రజా జ్యోతి ):** సత్యనారాయణపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పీహెచ్‌సీ నుండి ఇటీవల చర్ల పీహెచ్‌సీకి తరలించిన 108 అంబులెన్స్‌ను తిరిగి సత్యనారాయణపురం పీహెచ్‌సీకి కేటాయించాలని కోరుతూ గ్రామస్థులు ఆదివారం భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠకు వినతిపత్రం అందజేశారు.సత్యనారాయణపురం రైతు వేదికలో ఆదివారం నిర్వహించిన సీతారామ ప్రాజెక్ట్ భూనిర్వాసితుల రైతుల సమావేశానికి హాజరైన సబ్ కలెక్టర్‌ను కలిసి ఆత్మ కమిటీ చైర్మన్ ఇందల బుచ్చిబాబు ఆధ్వర్యంలో గ్రామస్థులు తమ సమస్యలను వివరించారు. సత్యనారాయణపురం పీహెచ్‌సీ పరిధిలో అనేక మారుమూల ఏజెన్సీ గ్రామాలు ఉన్నాయని ఈ ప్రాంత ప్రజలకు 108 అంబులెన్స్ సేవలు అత్యంత అవసరమని తెలిపారు.ఈ సందర్భంగా దానవాయిపేటకు చెందిన రూంజా రాజా మాట్లాడుతూ108 అంబులెన్స్‌ను చర్లకు తరలించిన తర్వాత అత్యవసర సమయాల్లో రోగులను ఆసుపత్రులకు తరలించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గర్భిణీలు, వృద్ధులు, ప్రమాద బాధితులు, తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న రోగులను సమయానికి ఆసుపత్రికి చేర్చలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో రాబోయే వర్షాకాలంలో పరిస్థితి మరింత క్లిష్టంగా మారుతోందన్నారు.ఏజెన్సీ ప్రాంతాల్లో సరైన రవాణా సౌకర్యాలు లేకపోవడంతో 108 అంబులెన్స్ ప్రజలకు ప్రాణాధారంగా పనిచేస్తోందని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని వెంటనే 108 వాహనాన్ని తిరిగి సత్యనారాయణపురం పీహెచ్‌సీకి కేటాయించాలని సబ్ కలెక్టర్‌ను కోరారు. సమస్యను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టర్ హామీ ఇచ్చినట్లు గ్రామస్థులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ ఇందల బుచ్చిబాబు, ఇందల రమేష్, నానిబాబు, రూంజా రాజా, అల్లి ఉమామహేష్, సాంబయ్య, ప్రవీణ్, సురేష్ ఆర్.కొత్తగూడెం, సత్యనారాయణపురం గ్రామాల పెద్దలు, రైతులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఎప్సెట్ ఫలితాల్లో 'బ్రిలియంట్' విద్యార్థుల విజయకేతనం



P.NAGA JYOTHI 26693 (A & P)



P.CHANDRA SHEKAR 22110 (Engg)



B.A.V.S MANIKANTA 24278 (Engg)



N.V S GANESH 27854 (Engg)



Y.VINEETHA 18534 (A & P)



G.THANMAI SRI 25205 (A & P)

**బూర్గంపహాడ్, మే 17 (ప్రజా జ్యోతి):** మండల పరిధిలోని సారపాక బ్రిలియంట్ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు ఆదివారం ప్రకటించిన ఎప్సెట్ ఫలితాల్లో మరోసారి విజయకేతనం ఎగురవేసినట్లు బ్రిలియంట్ విద్యాసంస్థల చైర్మన్ బీఎన్ఆర్ ఆదివారం తెలిపారు. ఇంజనీరింగ్ విభాగంలో పి.జయంత్ రెడ్డి 1498 ర్యాంకు, పి.చంద్రశేఖర్ 22110, బీఏవీఎస్ మణికంఠ 24278, ఎన్వీఎస్ గణేష్ 27854 ర్యాంకులు సాధించగా, అగ్రికల్చర్ విభాగంలో వై.వినీత 18534, జి.తన్మయశ్రీ 25205, పి.నాగజ్యోతి 26693 ర్యాంకులు సాధించి కళాశాలకు మంచిపేరు తెచ్చారన్నారు. బీఎన్ఆర్ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఎప్సెట్ కోచింగ్ తీసుకుని 99శాతం ఉత్తీర్ణత సాధించినందుకు మెమోంటోలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో బ్రిలియంట్ జూనియర్ కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## నిరంతర కృషి పట్టుదల ఉంటే ఏదైనా సాధ్యమే

- పి.నాగరాజు సర్కిల్ ఇన్స్పెక్టర్ అశ్వారావుపేట
- పోటీ పరీక్షల్లో సత్తా చాటిన అన్నదమ్ములు
- అభినందించిన అధికారులు

**అశ్వారావుపేట, మే 16, ప్రజాజ్యోతి :** నిరంతర కృషి పట్టుదల ఉంటే విద్యార్థులు చదువులో రాణించగలరని అశ్వారావుపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగరాజు అన్నారు.సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలవిద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో, ప్రతిష్టాత్మక విద్యాసంస్థల ప్రవేశ పరీక్షల్లో అద్భుతమైన ప్రతిభ కనబరిచి ఘన విజయాలు సాధించారు. ఇటీవల విడుదలైన పదో తరగతిలో ఫలితాలలో పాఠశాలకు చెందిన పాలపాంటి జస్వంత్ చంద్ర అనే విద్యార్థి 548 మార్కులుసాధించి, పాఠశాల స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచాడు. అలానే ప్రవేశ పరీక్షల్లో ప్రతిభఅదేవిధంగా, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 269 సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల నుండి మొత్తం 26,900 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, ఈ పాఠశాలకు చెందిన పాలపాంటి లోహిత్ రామ్ పునీత్ అనే విద్యార్థి అసాధారణ ప్రతిభ కనబరిచాడు. ఇతడు ప్రతిష్టాత్మక ఉప్పల్ సిఓఈ నందు 8వ తరగతిలో సీటు సాధించి పాఠశాలకు ఎనలేని గర్వకారణంగా నిలిచాడు.దీనితో పాటు, పాఠశాల విద్యార్థులు సైనిక్ స్కూల్ రిక్రూట్‌మెంట్ పరీక్షల్లో, దేశంలోని ఇతర 8 సిఓఈలలో ఐఐటి, నీట్ ఫౌండేషన్ కోచింగ్ ల కొరకు ఎంపికై అద్భుతమైన ఫలితాలను సాధించారు. పరీక్షా ఫలితాల్లో ఉత్తమ చాటిన విద్యార్థులను సిఐ నాగరాజు, కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు అభినందించారు.ఈ సందర్భంగా సిఐ నాగరాజు కళాశాల మాట్లాడు తూ ఉపాధ్యాయుల నిరంతర కృషి, విద్యార్థుల పట్టుదల ఉంటే పోటీ పరీక్షలలో మంచి ఫలితాలు సాధించవచ్చని, విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాన్ని పెట్టుకొని పరీక్షలకు సిద్ధం అవ్వాలన్నారు. మంచి ఫలితాలు సాధించిన ఈ విద్యార్థులు భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానంలో నిలవాలని ఆకాంక్షించారు. విజయం సాధించిన విద్యార్థులకు, వారికి సహకరించిన తల్లిదండ్రులకు, ఉపాధ్యాయ సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేశారు.



# ఎనిమిది మంది మావోయిస్టుల అరెస్ట్

- భారీగా ఆయుధాలు, నగదు స్వాధీనం
- అరెస్టు చేసిన వారిపై 64 లక్షల రివార్డు






**చర్ల ,మే 17:(ప్రజా జ్యోతి ):**తెలంగాణ సరిహద్దు రాష్ట్రమైన మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో పోలీసులు, సీఆర్ పీఫ్ సంయుక్తంగా నిర్వహించిన "ఆపరేషన్ అంతిమ్ ప్రహర్"లో కీలక విజయం సాధించారు. ఈ ఆపరేషన్‌లో మొత్తం 8 మంది హార్డ్‌కోర్ మావోయిస్టులను అరెస్ట్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. అరెస్టయిన వారిలో ఇద్దరు డివిజనల్ కమిటీ సభ్యులు (డీవీసీఎం), ఇద్దరు ప్రాంతీయ కమిటీ సభ్యులు (పీపీసీఎం)తో పాటు పలువురు క్రియాశీల మావోయిస్టు సభ్యులు ఉన్నట్లు తెలిపారు. వీరిపై మహారాష్ట్ర ప్రభుత్వం మొత్తం రూ.64 లక్షల బహుమతి ప్రకటించినట్లు సమాచారం.పోలీసుల వివరాల ప్రకారం అరెస్టయిన మావోయిస్టుల్లో కొందరు 2026 ఫిబ్రవరి 7న ఫోదేవాడ అటవీ ప్రాంతంలో జరిగిన ఎదురుకాల్పుల్లో సీ-60 జవాన్ హత్య ఘటనలో పాల్గొన్నట్లు గుర్తించారు. రహస్య సమాచారంతో తెలంగాణ సరిహద్దు ప్రాంతాలు, కుమ్నార్, నైతాలా ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి వీరిని అదుపులోకి తీసుకున్నారు అని ఆపరేషన్ సందర్భంగా పోలీసులు భారీగా ఆయుధాలు, మందుగుండు సామాగ్రి మరియు నగదును స్వాధీనం చేసుకున్నారు అని అన్నారు .స్వాధీనం చేసుకున్న వాటిలో 2 ఎల్ఎమ్‌జీలు, 4 ఏకే-47లు, 4 ఎస్ఎల్ఆర్‌లు, 3 ఇన్సాస్ రైఫిల్స్‌తో పాటు మొత్తం 51 తుపాకులు ఉన్నాయి. అదేవిధంగా రూ.65 లక్షల 34 వేల నగదును కూడా జప్తు చేశారు.కుమ్నార్ ప్రాంతంలో అరెస్టయిన డీవీసీఎం రాజు అలియాస్ మంగ్డూ వేకో, అతని భార్య జన్ని అలియాస్ నగి యేమ్లా వద్ద నుంచి ఏకే-47, .303 రైఫిల్, 12 బోర్ గన్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే నైతాలా ప్రాంతంలో ఇద్దరు మహిళా మావోయిస్టులను ఎస్ఎల్ఆర్, 12 బోర్ మరియు సింగిల్ షాట్ రైఫిల్స్‌తో అరెస్ట్ చేసినట్లు తెలిపారు.పోలీసుల విచారణలో మావోయిస్టులు పోలీసు జవాన్లపై దాడులకు ప్రణాళికలు రూ పొందించినట్లు అడవుల్లో ఆయుధా లు, పేలుడు పదార్థాలను దాచిపెట్టిన ట్లు బయటపడింది. ఈ సమాచారం ఆధారంగా చేపట్టిన సెర్చ్ ఆపరేషన్‌లో మరిన్ని ఆయుధాలు, పేలుడు పదార్థాలు లభ్యమైనట్లు అధికారులు పేర్కొన్నారు.ఈ ఆపరేషన్‌తో గడ్చిరోలి జిల్లాలో మావోయిస నెట్ వర్క్‌కు గట్టి దెబ్బ తగిలిందని పోలీసులు తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో పోలీసు రికార్డుల్లో ఉన్న క్రియాశీల మావోయిస్టులందరూ అరెస్ట్ అయ్యారని ,కొందరు లొంగిపోయారని అన్నారు .

## పెట్రోల్, డీజిల్ ధరల పెంపు వెంటనే వెనక్కి తీసుకోవాలి

- మండల అధ్యక్షుడు పరిమి శ్రీనివాసరావు



**భద్రాచలం, మే 17, ప్రజా జ్యోతి :**కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని భద్రాచలం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పరిమి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెట్రోల్, డీజిల్ ధరలపై లీటరుకు అదనంగా మూడు రూపాయలు పెంచడం సామాన్య ప్రజలపై మరింత భారాన్ని మోపినట్లేనన్నారు. ఇప్పటికే పెరిగిన ధరలు, ద్రవ్యోల్బణంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో కేంద్ర ప్రభుత్వం మరోసారి ప్రజలపై భారం వేయడం బాధాకరమని విమర్శించారు.డీజిల్, పెట్రోల్ ధరల పెంపుతో రవాణా ఖర్చులు పెరిగి, నిత్యావసర వస్తువుల ధరలు మరింత పెరిగే ప్రమాదం ఉందన్నారు. దీనివల్ల సామాన్యులు, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.సామాన్య ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోకుండా కేంద్ర ప్రభుత్వం ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటోందని విమర్శించిన ఆయన, ప్రజల సమస్యలను విస్మరిస్తే రాబోయే రోజుల్లో ప్రజలే తగిన సమాధానం చెబుతారని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని పరిమి శ్రీనివాసరావు స్పష్టం చేశారు.

## ఐదుగురు మావోయిస్టుల లొంగుబాటు

- లొంగిపోయిన వారిపై రూ 38 లక్షల రివార్డ్






**చర్ల , మే 17:(ప్రజా జ్యోతి ):**గడ్చిరోలి పోలీసులు , సీఆర్ పీఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో మరో కీలక విజయాన్ని సాధించారు. మొత్తం ఐదుగురు సీనియర్ హార్డ్ కోర్ మావోయిస్టులు శుక్రవారం అధికారుల సమక్షంలో లొంగిపోయారు. వీరిలో ఒకరు డీవీసీఎం, ఒకరు పీపీసీఎం, ఒకరు ఏసీఎం స్థాయి నేతలతో పాటు ఇద్దరు సభ్యులు ఉన్నారు. వీరిపై మహారాష్ట్ర ప్రభుత్వం కలిపి రూ.38 లక్షల బహుమతిని ప్రకటించింది.లొంగిపోయిన మావోయిస్టులను మధు అలియాస్ రాకేష్ అలియాస్ బాజీరావ్ బుక్లూ వేల్దా (డీవీసీఎం), జీవన్ అలియాస్ జగ్గు అలియాస్ భీమా దేవా మడ్కామ్ (పీపీసీఎం), రజని అలియాస్ దుర్గ అలియాస్ రామోతి ధుర్వా (ఏసీఎం), మంగ్లీ రఘు కుర్సామ్, లక్ష్మి డేంగా పునేమ్ లుగా గుర్తించారు. వీరు గడ్చిరోలి, సుక్మా, బీజాపూర్, మాన్ పూర్ ప్రాంతాలకు చెందినవారని పోలీసులు తెలిపారు.వివరాల ప్రకారం గడ్చిరోలి జిల్లాలో ఒకప్పుడు 10 ఉపవిభాగాల్లో చురుకుగా సాగిన మావోయిస్టు కార్యకలాపాలు ప్రస్తుతం భామ్రాగఢ్ సరిహద్దు ప్రాంతాలకు మాత్రమే పరిమితమయ్యాయి. ప్రభుత్వం అమలు చేస్తున్న లొంగుబాటు విధానం, పునరావాస పథకాలు పోలీసుల నిరంతర ఆపరేషన్ల ఫలితంగా అనేక మంది మావోయిస్టులు ప్రధాన ప్రవాహంలోకి వస్తున్నారని అధికారులు పేర్కొన్నారు.ఇప్పటివరకు గడ్చిరోలి పోలీసుల ఎదుట మొత్తం 819 మంది మావోయిస్టులు లొంగిపోయారని, 2025 సంవత్సరం నుంచి ఇప్పటివరకు 137 మంది హార్డ్ కోర్ మావోయిస్టులు సరెండర్ చేసినట్లు వెల్లడించారు. 2022 నుంచి ఇప్పటివరకు 171 మంది హార్డ్ కోర్ మావోయిస్టులు లొంగిపోయినట్లు తెలిపారు. లొంగిపోయిన మధు అలియాస్ రాకేష్ పై రూ.16 లక్షలు, జీవన్ పై రూ.8 లక్షలు, రజనిపై రూ.6 లక్షలు, మంగ్లీ లక్ష్మిపై చెరో రూ.4 లక్షల ఇనాం ప్రకటించబడింది అని వీరికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పునరావాస పథకాల కింద ఆర్థిక సహాయం కూడా అందించనున్నట్లు తెలిపారు.ముఖ్యంగా గత ఏడాది అక్టోబర్ 15న కేంద్ర కమిటీ సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్ రావు అలియాస్ భూపతి సహా 61 మంది మావోయిస్టులు 54 ఆయుధాలతో లొంగిపోవడం దండకారణ్య ప్రాంతంలోని మావోయిస్టు ఉద్యమానికి పెద్ద ఎదురుదెబ్బగా మారిందని అధికారులు పేర్కొన్నారు. భూపతి లొంగిపోయిన తర్వాత దేశవ్యాప్తంగా 1063 మంది మావోయిస్టులు 637 ఆయుధాలతో సరెండర్ చేసినట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో సీఆర్ పీఎఫ్ డీఐజీ అజయ్ కుమార్ శర్మ, గడ్చిరోలి ఎస్పీ ఎం.రమేష్, అదనపు ఎస్పీలు కార్తీక్ మధిర, గోకుల్ రాజ్ జీ., సీఆర్ పీఎఫ్ అధికారులు నరేంద్ర కుమార్, సుమిత్ వర్మ, డీఎస్పీ విశాల్ నాగర్ గోజే తదితరులు పాల్గొన్నారు. ప్రత్యేక ఆపరేషన్ బృందం సహా అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది ఈ కార్యక్రమం విజయవంతానికి కృషి చేసినట్లు అధికారులు తెలిపారు.

## కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



**ఇల్లందు, మే 17, ప్రజాజ్యోతి:** సింగరేణి సంస్థ ఇల్లందు ఏరియాలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఐఎన్టియుసి ఏరియా ఉపాధ్యక్షుడు జె వెంకటేశ్వర్లు కోరారు. ఆదివారం ఐఎన్టియుసి ఆధ్వర్యంలో ఏరియా జియం కు వినతిపత్రం అందజేశారు.ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థ కాలయాపన చేయకుండా జెకె 5 ఓసి పొడగింపు ప్రాజెక్టును త్వరత గతిన ప్రారంభించాలన్నారు. స్పందించిన జిఎం జెకె 5 పొడిగింపు ప్రాజెక్టు అక్టోబర్ నెలలో ప్రారంభించే అవకాశాలు ఉన్నాయని తెలిపినట్లు జె వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టియుసి కేంద్ర కమిటీ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ మహబూబ్, అసంఘటిత రంగ సెక్రెటరీ గోచికొండ సత్యనారాయణ, ఏరియా చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ అజ్మీరా ఉపేందర్, ఏరియా సెక్రటరీలు రాకూరి బాబురావు, యండి అన్వర్, మధు, రఘు, విజయ్, మహేష్ పాల్గొన్నారు.

## భద్రాచలంలో యువకుడు అదృశ్యం



**భద్రాచలం , మే 17, ప్రజా జ్యోతి:** భద్రాచలం పట్టణానికి చెందిన ఓ యువకుడు ఇంటి నుంచి వెళ్లిపోయి అదృశ్యమైన ఘటన స్థానికంగా ఆందోళన కలిగిస్తోంది.పోలీసుల వివరాల ప్రకారం.. భద్రాచలం రెవెన్యూ కాలనీకి చెందిన డికొండ సాయి మణికుమార్ (29), తండ్రి సురేష్, బీటెక్ పూర్తి చేసి కొంతకాలంగా చిన్న చిన్న వ్యాపారాలు నిర్వహిస్తూ ప్రస్తుతం ప్రైవేట్ ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నాడు.ఈ నెల 12వ తేదీ రాత్రి సుమారు 9 గంటల సమయంలో కుటుంబ సభ్యులు అతనితో వివాహం విషయమై మాట్లాడగా, పెళ్లి చేసుకోవడం ఇష్టం లేకపోవడంతో ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు సమాచారం.యువకుడు కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు భద్రాచలం పట్టణం మొత్తం గాలించినప్పటికీ ఆచూకీ లభించలేదు. దీంతో అతని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు భద్రాచలం సబ్ ఇన్‌స్పెక్టర్ జి. స్వప్న కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.డికొండ సాయి మణికుమార్ గురించి ఎవరికైనా సమాచారం తెలిసినట్లయితే వెంటనే భద్రాచలం పోలీసులను సంప్రదించాలని పోలీసులు కోరుతున్నారు.

## కిక్ బాక్సింగ్‌లో సత్తా చాటిన పాల్వంచ చిన్నారులు

- ఎంపికైన విజేతలకు కొత్వాల దంపతుల ఘన సన్మానం.



**పాల్వంచ, మే 17, ప్రజాజ్యోతి:**విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి పుట్టిన ప్రాంతానికి వన్నె తేవాలని రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్, పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు అన్నారు.ఈ నెల 9, 10 తేదీల్లో రంగారెడ్డి జిల్లాలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్ టోర్నమెంట్‌లో పాల్వంచ 2వ డివిజన్ ప్రశాంతి నగర్ కాలనికి చెందిన సోదరీమణులు బొమ్మా రోజస, బొమ్మా తాన్వి వివిధ విభాగాల్లో ప్రథమ స్థానాలు సాధించి బంగారు పతకాలు గెలుచుకుని జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. విజేతలు తమ తల్లిదండ్రులతో కలిసి పాత పాల్వంచలోని కొత్వాల స్వగృహానికి వెళ్లి ఆశీర్వాదం పొందారు.ఈ సందర్భంగా కొత్వాల విమలాదేవితో కలిసి కొత్వాల శ్రీనివాసరావు విజేతలను, వారి తల్లిదండ్రులను శాలువాలు, బొకేలతో ఘనంగా సత్కరించారు. కొత్వాల మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సా ధించి జాతీయ స్థాయికి ఎంపిక కావడం పాల్వంచ ప్రాంతానికే గర్వకారణమన్నారు. చిన్నారుల తల్లిదండ్రులు బొమ్మా స్రవంతి, బొమ్మా రామ్‌కిరణ్‌తో పాటు శిక్షణ అందించిన పాల్వంచ ఎక్స్‌ట్రీమ్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ కోచ్ కొనే సూరిబాబును అభినందించారు. మజీద్, సతీష్, మల్లేష్, నరేష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

- చెమట చిందించిన రైతుకు చాటునైనా చోటు లేదు
- రైతు బజార్ లేక గిరిజన రైతుల అవస్థలు
- రోడ్డుపైనే పంట అమ్ముకుంటున్న ఏజెన్సీ రైతులు
- గిట్టుబాటు లేక సాగుకు దూరమవుతున్న గిరిజనులు
- మధ్యవర్తుల చేతుల్లోనే రైతుల భవిష్యత్తు
- భద్రాచలంలో రైతు బజార్ కోసం పెరుగుతున్న డిమాండ్





## అడవిలో పండిన పంటకు...

# అమ్ముకునే చోటేదీ..?

**రైతులు తాము పండించిన పంటను నేరుగా ప్రజలకు విక్రయించుకునే అవకాశాన్ని కల్పించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో రైతు బజార్లు ఏర్పాటు చేశారు. దీంతో రైతులకు గిట్టుబాటు ధర లభించడంతో పాటు ప్రజలకు కూడా తాజా కూరగాయలు, పండ్లు అందుబాటులోకి వస్తున్నాయి. అయితే ఏజెన్సీ ప్రాంతానికి కేంద్రంగా ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో మాత్రం పరిస్థితి పూర్తిగా భిన్నంగా కనిపిస్తోంది. వందలాది మంది గిరిజన రైతులు తాము కష్టపడి పండించిన కూరగాయలు, పండ్లు, అడవిలో సేకరించిన అటవీ ఉత్పత్తులను అమ్ముకునేందుకు సరైన వేదిక లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో భద్రాద్రి ఏజెన్సీలో నెలకొన్న పరిస్థితులపై ప్రజాజ్యోతి అందిస్తున్న ప్రత్యేక కథనం.**

● భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి (భూక్యా రంజిత్ నాయక్), ప్రజాజ్యోతి

భద్రాచలం ఏజెన్సీ పరిధిలోని దుమ్ముగూడెం, చర్ల, వెంకటాపురం, వాజేడు మండలాలతో పాటు భద్రాచలాన్ని ఆనుకుని ఉన్న అల్లూరి సీతారామ రాజు జిల్లాకు చెందిన పలు గిరిజన గ్రామాల ప్రజలు కూరగాయల సాగుపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. మరికొందరు అడవిలో లభించే అటవీ ఉత్పత్తులను సేకరించి జీవిక పొందుతున్నారు. ప్రతిరోజూ తెల్లవారుజామునే తమ గ్రామాల నుంచి ఆటోలు, చిన్న వాహనాల్లో కూరగాయలు, పండ్లు తీసుకుని భద్రాచలం చేరుకుంటున్నారు. అయితే పట్టణంలో రైతులు నేరుగా విక్రయాలు చేసుకునేందుకు ప్రత్యేకంగా రైతు బజార్ లేకపోవడంతో రోడ్డుపక్కనే అమ్మకాలు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయ్యప్పస్వామి ఆలయానికి ఎదురుగా ఉన్న ప్రధాన రహదారిపై, ఐటిడిఏ గ్రౌండ్ ఎదురుగా ఉన్న కొద్దిపాటి ఖాళీ ప్రదేశంలోనే గిరిజన రైతులు ఎండలో ఎండుతూ, వానలో తడుస్తూ తమ పంటను అమ్ముకుంటున్నారు. కనీసం తాగునీరు, షెడ్లు, పారిశుద్ధ్య సౌకర్యాలు కూడా లేకపోవడంతో మహిళా రైతులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

### ››› కమిషన్ వ్యాపారుల దయాదాక్షిణ్యాల పైనే రైతుల బతుకు

రైతు బజార్ లేకపోవడంతో గిరిజన రైతులంతా కమిషన్ వ్యాపారులపైనే ఆధారపడాల్సి వస్తోంది. రైతుల వద్ద తక్కువ ధరలకు సరుకులు కొనుగోలు చేస్తున్న మధ్యవర్తులు అదే సరుకులను పట్టణ మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. దీంతో రైతుకు గిట్టుబాటు ధర దక్కకపోగా వినియోగదారుడు మాత్రం అధిక ధరలు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. మధ్యలో కమిషన్ వ్యాపారులకే అధిక లాభాలు దక్కుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.

### ››› సాగుపై తగ్గుతున్న ఆసక్తి

తాము పండించిన పంటను అమ్ముకునేందుకు సరైన వేదిక లేకపోవడంతో అనేక మంది గిరిజన రైతులు కూరగాయల సాగుపై ఆసక్తి కోల్పోతున్నారని స్థానికులు చెబుతున్నారు. కష్టపడి పండించిన పంటకు సరైన ధర రాకపోవడం, మార్కెట్ సౌకర్యం లేకపోవడం, రవాణా ఖర్చులు పెరగడం వంటి కారణాలతో కొందరు రైతులు సాగును తగ్గిస్తున్నట్లు సమాచారం. ఏజెన్సీ ప్రాంతంలో నీటి వనరులు, సాగుకు అనువైన భూములు ఉన్నప్పటికీ మార్కెటింగ్ సౌకర్యాల లేమితో రైతులు నష్టపోతున్నారని రైతు సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతు బజార్ ఏర్పాటు చేస్తే గిరిజన రైతుల్లో మళ్లీ సాగుపై ఆసక్తి పెరుగుతుందని అభిప్రాయపడుతున్నారు.

### ››› రైతు బజార్ లేక ప్రజలకూ భారమే

ఒకవైపు రైతులు గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు పడుతుంటే మరోవైపు ప్రజలు కూడా అధిక ధరలకు కూరగాయలు కొనాల్సి వస్తోంది. రైతులు నేరుగా విక్రయించే అవకాశం లేకపోవడంతో మధ్యవర్తుల పెత్తనం పెరిగి ఏజెన్సీ ప్రాంతంలోనే కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని ప్రజలు చెబుతున్నారు. రైతు బజార్ ఏర్పాటు చేస్తే రైతులకు గిట్టుబాటు ధర లభించడంతో పాటు ప్రజలకు కూడా తక్కువ ధరల్లో తాజా కూరగాయలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

### ››› గిరిజన అభివృద్ధికి ఐటిడిఏ చర్యలు

భద్రాచలం ఐటిడిఏ కేంద్రంగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఐటిడిఏ పీఓ రాహుల్ గిరిజన ప్రజల అభివృద్ధికి పలు వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నారు. గిరిజన మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడం, కుటీర పరిశ్రమలకు ప్రోత్సాహం ఇవ్వడం, సాగు విధానాలపై సాంకేతిక శిక్షణ అందించడం వంటి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇటీవల భద్రాచలంలో గిరిజన మ్యూజియం ఏర్పాటు చేయడంతో పాటు ఏజెన్సీ ప్రాంతంలో లభించే అటవీ ఉత్పత్తులను ప్రజలకు చేరువ చేసే లక్ష్యంతో "భద్రాద్రి గిరి మార్ట్" ఏర్పాటు చేయడం ప్రశంసలు అందుకుంది. అయితే ప్రజలకు నిత్యం అవసరమయ్యే కూరగాయలు, పండ్లు, ఇతర రోజువారీ వస్తువులను రైతులు నేరుగా విక్రయించుకునేందుకు రైతు బజార్ తరహా వేదిక కూడా అవసరమని గిరిజనులు కోరుతున్నారు.

### ››› అధికారుల చొరవ అవసరం

భద్రాచలం వంటి ఏజెన్సీ కేంద్రంలో రైతు బజార్ ఏర్పాటు చేస్తే వందలాది మంది గిరిజన రైతులకు ఊరట లభించడంతో పాటు ప్రజలకు కూడా నాణ్యమైన కూరగాయలు, పండ్లు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుంది. మార్కెటింగ్ సౌకర్యాలు పెరిగితే గిరిజన రైతుల్లో సాగుపై ఆసక్తి కూడా పెరుగుతుందని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, ఐటిడిఏ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి రైతు బజార్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని గిరిజనులు కోరుతున్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో రైతు బజార్ ఏర్పాటు గిరిజన రైతుల జీవితాల్లో కీలక మార్పుకు నాంది కావొచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



"అడవిలో కష్టపడి పండించిన కూరగాయలు అమ్ముకోవడానికి సరైన స్థలం లేదు. రోడ్డుపక్కనే కూర్చొని అమ్ముకోవాల్సి వస్తోంది. రైతు బజార్ ఉంటే మాకు ఎంతో ఉపయోగం ఉంటుంది. ఎండలోనూ, వానలోనూ బయటే కూర్చొని అమ్మకాలు చేస్తున్నాం. కనీసం షెడ్డు కూడా లేదు. అధికారులు మా సమస్యలు గుర్తించాలి.

– భద్రమ్మ, మహిళ రైతు



భద్రాద్రి ఏజెన్సీ ప్రాంతం అటవీ సంపదకు, సహజ వ్యవసాయానికి నిలయంగా ఉంది. ఈ ప్రాంతంలో గిరిజనులు అడవిలో లభించే పండ్లు, ఆకుకూరలు, అటవీ ఉత్పత్తులను సేకరించడంతో పాటు చిన్నచిన్న భూముల్లో కూరగాయల సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. అయితే వారు కష్టపడి పండించిన లేదా సేకరించిన ఉత్పత్తులను నేరుగా విక్రయించుకునేందుకు సరైన వేదిక లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతు బజార్ లేకపోవడంతో గిరిజన రైతులు మధ్యవర్తులపై ఆధారపడాల్సి వస్తోంది. దీంతో రైతులకు గిట్టుబాటు ధర దక్కడం లేదు. మరోవైపు ప్రజలు కూడా అధిక ధరలకు కూరగాయలు కొనాల్సి వస్తోంది. ఈ పరిస్థితులు కొనసాగితే గిరిజనుల్లో క్రమంగా సాగుపై ఆసక్తి తగ్గిపోయే ప్రమాదం ఉంది.

– కుప్పాల నాగరాజు, సీనియర్ జర్నలిస్ట్



భద్రాచలం వంటి ఏజెన్సీ కేంద్రంలో శాశ్వత రైతు బజార్ ఏర్పాటు చేస్తే గిరిజన రైతులకు గిట్టుబాటు ధర లభించడంతో పాటు ప్రజలకు కూడా నాణ్యమైన కూరగాయలు, అటవీ ఉత్పత్తులు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుంది. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది

– ముర్ల రమేష్, కొండారెడ్డి సంఘము నాయకులు



"ఏజెన్సీ ప్రాంతంలో పండే కూరగాయలకు మంచి డిమాండ్ ఉంది. కానీ రైతులకు సరైన మార్కెట్ లేకపోవడం బాధాకరం. రైతు బజార్ అవసరం చాలా ఉంది." స్థానికంగా రైతు బజార్ లేకపోవడంతో "కమిషన్ వ్యాపారులు చెప్పిన ధరకే అమ్మాల్సి వస్తోంది. పంటకు గిట్టుబాటు ధర రావడం లేదు. రైతు బజార్ ఏర్పాటు చేస్తే మాకు నేరుగా అమ్ముకునే అవకాశం ఉంటుంది.

– అచ్చమ్మ, మహిళ రైతు

# హస్తంలో అసంతృప్తి సెగలు

- పదవుల కేటాయింపుపై గళమెత్తిన నేతలు
- కాంగ్రెస్ కార్యకర్తల్లో పెరుగుతున్న అసంతృప్తి..
- నామినేటెడ్ పదవులపై సీనియర్ నాయకుల తీవ్ర ఆగ్రహం



**చర్ల, మే 17 (ప్రజాజ్యోతి):** చర్ల మండల కాంగ్రెస్ పార్టీ నామినేటెడ్ పదవుల కేటాయింపు వ్యవహారం ప్రస్తుతం పార్టీలో తీవ్ర దుమారం రేపుతోంది. మండలంలోని మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, దీర్ఘకాలంగా పార్టీ కోసం కష్టపడుతున్న కార్యకర్తలు ఈ వ్యవహారంపై బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేస్తూ తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శనివారం సాయంత్రం చర్ల మండలంలోని కేవిఎన్ఆర్ ఫంక్షన్ హాల్ లో సమావేశం అయ్యారు. ఈ సందర్భగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో పార్టీ జెండాను భుజాన మోసిన నాయకులను పక్కనపెట్టి ఇటీవల పార్టీలో చేరిన వారికి ప్రజా మద్దతు లేని వారికి నామినేటెడ్ పదవులు ఇవ్వడం ద్వారా అసలు కాంగ్రెస్ వాదులను అవమానిస్తున్నారని ఆరోపించారు.పార్టీ కోసం ఎన్నో సంవత్సరాలుగా గ్రామస్థాయిలో కష్టపడిన కార్యకర్తలకు కాకుండా కేవలం కొందరి అనుచరులకు మాత్రమే పదవులు కట్టబెట్టడం వల్ల నిజమైన కాంగ్రెస్ కార్యకర్తల్లో తీవ్ర నిరాశ నెలకొందన్నారు. “కనీసం మూడేళ్లు పార్టీ కోసం పనిచేసిన వారికే పదవులు ఇస్తాం” అంటూ గతంలో నాయకత్వం ఇచ్చిన హామీలు ఇప్పుడు అమలు కాలేదని మండిపడ్డారు. పార్టీ సభ్యత్వం కూడా సరిగా లేని వారికి కార్యకర్తల ఆమోదం లేని వారికి ప్రజల్లో ఎలాంటి గుర్తింపు లేని వ్యక్తులకు పదవులు ఇవ్వడం కాంగ్రెస్ పార్టీని బలహీనపరిచే చర్య అని పేర్కొన్నారు.గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు వ్యతిరేకంగా పనిచేసిన వ్యక్తులు పదవుల కోసం పార్టీలు మారే స్వార్థపరులు రాజకీయ లాభాల కోసం రంగు మార్చే నాయకులకు ప్రాధాన్యత ఇవ్వడం బాధాకరమన్నారు. పార్టీ సిద్ధాంతాలను నమ్మి ఎటువంటి ఆశలు లేకుండా ఎన్నో సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేస్తున్న నిజమైన కార్యకర్తలకు మాత్రం గుర్తింపు లేకపోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతం కన్నా వ్యక్తిగత అనుచరులను ప్రోత్సహించే విధంగా వ్యవహరిస్తున్నారన్నారు. టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కూడా స్థానిక కార్యకర్తల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా పదవులను ప్రకటించడం బాధాకరమని పేర్కొన్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు దేవి ప్రసన్న కనుసన్నల్లోనే ఈ వ్యవహారం జరిగిందా? లేక మరెవరి ప్రోద్బలంతో ఈ నిర్ణయాలు తీసుకున్నారో పార్టీ అధిష్టానం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.పార్టీలో పైరవీలు చేసే వారు అధికార అండ ఉన్న వారికే నామినేటెడ్ పదవులు దక్కుతున్నాయని పార్టీ కోసం నిజాయితీగా కష్టపడే కార్యకర్తలకు మాత్రం అవకాశాలు దక్కడం లేదని మండిపడ్డారు. ఈ పరిస్థితి కొనసాగితే రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి గ్రామస్థాయిలో తీవ్ర నష్టం కలిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు.గత పదేళ్లుగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని ప్రతి గ్రామంలో పార్టీ కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు ఇదేనా నాయకత్వం ఇచ్చే గౌరవమని ప్రశ్నించారు. ప్రస్తుతం మండల స్థాయిలోనే కాకుండా నియోజకవర్గ స్థాయిలో కూడా కార్యకర్తల్లో అసంతృప్తి పెరుగుతోందని పేర్కొన్నారు. పార్టీ కోసం కష్టపడిన వారిని విస్మరించి అవకాశవాదులను ప్రోత్సహిస్తే భవిష్యత్తులో పార్టీకి తీవ్ర ప్రతికూల పరిస్థితులు ఎదురయ్యే అవకాశముందని చర్ల మండల కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ బలోపేతమే నా లక్ష్యం

- మండల కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్ కుమార్ నాయుడు





**చర్ల, మే 17(ప్రజా జ్యోతి ):** చర్ల మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా నియమితులైన విజయ్ కుమార్ నాయుడు ఆదివారం అధికారికంగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. చర్ల మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు చీమలమర్రి మురళి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయనకు బాధ్యతలు అప్పగించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు చీమలమర్రి మురళి మాట్లాడుతూ విజయ్ కుమార్ నాయుడు కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేస్తున్న నిబద్ధత కలిగిన కార్యకర్త అని యూత్ కాంగ్రెస్‌లో చురుకైన పాత్ర పోషిస్తూ పార్టీ కార్యక్రమాలను గ్రామస్థాయి వరకు తీసుకెళ్లడంలో ఆయన విశేష కృషి చేశారని తెలిపారు. క్రమశిక్షణ, అంకితభావం, నాయకత్వ లక్షణాలను గుర్తించిన కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఆయనను చర్ల మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమించిందన్నారు.మండల అధ్యక్షుడిగా విజయ్ కుమార్ నాయుడు అందరినీ సమన్వయం చేసుకుంటూ పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. గ్రామ స్థాయి కార్యకర్తలతో నిరంతరం మమేకమై ప్రజా సమస్యలపై పోరాడాలని, పార్టీ కార్యక్రమాలను ప్రతి గ్రామానికి తీసుకెళ్లాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని ఆకాంక్షించారు.నూతనంగా బాధ్యతలు చేపట్టిన మండల కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్ కుమార్ నాయుడు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం, జిల్లా నాయకత్వం తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సాధారణ కార్యకర్తగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన తాను పార్టీ కోసం ఎప్పటికప్పుడు కష్టపడి పనిచేశానని తెలిపారు. కార్యకర్తగా ఉన్న సమయంలో గ్రామాల్లో పార్టీ కార్యక్రమాలు నిర్వహించడం, ప్రజా సమస్యలపై స్పందించడం తనకు ఎంతో అనుభవాన్ని ఇచ్చిందన్నారు.ఇకపై మండల అధ్యక్షుడిగా ప్రతి కార్యకర్తను కలుపుకొని ముందుకు సాగుతానని, సీనియర్ నాయకుల సూచనలు, సలహాలను పాటిస్తూ కాంగ్రెస్ పార్టీని గ్రామ స్థాయిలో మరింత బలోపేతం చేస్తానని చెప్పారు. పార్టీ కార్యకర్తల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడిగా పనిచేస్తానని హామీ ఇచ్చారు. గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీకి మరింత బలం చేకూర్చేందుకు యువతను ప్రోత్సహిస్తానని తెలిపారు.రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేస్తానని, పార్టీ జెండాను మరింత ఎత్తుకు తీసుకెళ్లేందుకు సమిష్టిగా పనిచేస్తానన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండి పోరాడుతూ కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో మరింత ఆదరణ తీసుకురావడమే తన లక్ష్యమని పేర్కొన్నారు.తనకు ఈ అవకాశం కల్పించిన జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు దేవి ప్రసన్న, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు, పీసీసీ జనరల్ సెక్రెటరీ నల్లపు దుర్గాప్రసాద్‌కు, జిల్లా ఉపాధ్యక్షులు చేమలమర్రి మురళికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పార్టీ కార్యకర్తగా ఉన్నప్పటి నుంచి తనకు అండగా నిలిచిన జవ్వాది రవికుమార్, బండారు రామకృష్ణతో పాటు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయ్ కుమార్ నాయుడికి పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉప అధ్యక్షులు చీమలమర్రి మురళి, లంక రాజు, ముమ్మినేని అరవింద్, ఆలం ఈశ్వర్, కాపుల నాగరాజు, తోటమల్ల రవి, బ్రహ్మానంద రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, యువజన నాయకులు, మహిళా కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు .

# ఇసుక కొరతతో నిర్మాణ రంగం కుదేలు..

- ఇసుక లేక పనులు లేవు-పనులు లేక జీవనం లేదు
- రాంపుల లేమి బిల్లుల జాప్యం ఉపాధి కోల్పోతున్న కార్మికులు
- ట్రాక్టర్ యజమానుల నుంచి టాపీ మేస్త్రిల వరకు తీవ్ర సంక్షోభం

**కొత్తగూడెం కలెక్టరేట్, పాల్వంచ ,మే 17,(ప్రజా జ్యోతి )** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో ఇసుక కొరత తీవ్ర స్థాయికి చేరుకుంది. అధికారిక ఇసుక రాంపులు లేకపోవడం, ఉన్న ఒక్క రాంప్ నుంచే తొలకాలు జరిపినా నెలల తరబడి బిల్లులు పెండింగ్‌లో ఉండటం, స్థానిక వాగుల నుంచి ఇసుక తరలిస్తే అధికారుల కేసులు, వాహనాల సీజ్ చర్యలు చేపట్టడం వంటి పరిణామాలతో ట్రాక్టర్ యజమానులు, కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఇటీవల వరకు నిర్మాణ రంగానికి ఆధారంగా నిలిచిన వందలాది మంది ట్రాక్టర్ యజమానులు ప్రస్తుతం అప్పుల భారంతో కుంగిపోతున్నారు. డీజిల్ ధరలు, వాహనాల మెయింటెనెన్స్ ఖర్చులు పెరుగుతున్న తరుణంలో పని లేక ఆదాయం ఆగిపోవడంతో చాలా మంది వాహనాలను నిలిపివేసే పరిస్థితి ఏర్పడింది. మరోవైపు రోజువారీగా ట్రాక్టర్లపై ఆధారపడి జీవించే డ్రైవర్లు, కూలీలు ఉపాధి లేక పస్తులు ఉండే పరిస్థితి నెలకొంది.

### ››› ఆరునెలలైనా రాని బిల్లులు..

ప్రభుత్వ అనుమతులతో ఇసుక తొలకాలు నిర్వహించినా బిల్లులు ఆరునెలల వరకు విడుదల కాకపోవడం పరిస్థితిని మరింత క్లిష్టంగా మారుస్తోంది. అప్పులు చేసి పనులు చేసిన ట్రాక్టర్ యజమానులు బిల్లుల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమయానికి చెల్లింపులు లేకపోవడంతో బ్యాంకు ఈఎంఐలు, ఫైనాన్స్ వడ్డీలు చెల్లించలేక ఆర్థికంగా కుదేలవుతున్నామని చెబుతున్నారు.

### ››› స్థానిక వాగులపై కఠిన చర్యలు..

ఇసుక కొరత నేపథ్యంలో కొంతమంది స్థానిక వాగుల నుంచి ఇసుక తరలించేందుకు ప్రయత్నిస్తే పోలీస్,రెవిన్యూ, అటవీ, మైనింగ్ అధికారులు కేసులు నమోదు చేసి ట్రాక్టర్లను సీజ్ చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమ తవ్వకాలను అరికట్టాల్సిన అవసరం ఉన్నప్పటికీ, ప్రత్యామ్నాయంగా అధికారిక రాంపులు ఏర్పాటు చేయకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని ప్రజలు అంటున్నారు.

### ››› నిలిచిపోయిన నిర్మాణాలు..

ఇసుక అందుబాటులో లేకపోవడంతో పట్టణంలో అనేక నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. వ్యక్తిగత గృహ నిర్మాణాలతో పాటు ప్రభుత్వ పథకాల కింద నిర్మిస్తున్న ఇండ్ల పనులు కూడా ఆలస్యమవుతున్నాయి. ముఖ్యంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు అవసరమైన ఇసుక దొరకక లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేసినా, నిర్మాణ సామగ్రి అందుబాటులో లేక పనులు ముందుకు సాగడం లేదని వాపోతున్నారు.

### ››› ఉపాధి కోల్పోతున్న టాపీ మేస్త్రిలు..

నిర్మాణ రంగం స్తంభించడంతో టాపీ మేస్త్రిలు, సెంటరింగ్ కార్మికులు, మజ్దూర్లు కూడా ఉపాధి కోల్పోతున్నారు. రోజువారీ కూలిపై ఆధారపడే కుటుంబాలు ఆదాయం లేక ఆర్థికంగా కష్టాల్లోకి జారుతున్నాయి.ఇసుక లేక పనులు లేవు పనులు లేక జీవనం లేదు అనే పరిస్థితి నిర్మాణ రంగ కార్మికులలో కనిపిస్తోంది.

### ››› ప్రభుత్వం వెంటనే స్పందించాలి..

ప్రస్తుత పరిస్థితిని ప్రభుత్వం అత్యవసర సమస్యగా గుర్తించాలని ప్రజలు, ట్రాక్టర్ యజమానులు, కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. అధికారిక ఇసుక రాంపులకు వెంటనే అనుమతులు ఇవ్వడం, స్థానిక అవసరాలకు అనుగుణంగా కొత్త రాంపులు ప్రారంభించడం, పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయడం ద్వారా మాత్రమే పరిస్థితి మెరుగుపడుతుందని వారు చెబుతున్నారు.లేనిపక్షంలో ట్రాక్టర్ యజమానులు అప్పుల బారిన పడి రోడ్డున పడే ప్రమాదం ఉందని, వేలాది మంది కూలీలు ఉపాధి కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణ రంగాన్ని నిలబెట్టాలంటే ఇసుక సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు.

